# తీపి విషం

పొగ చూరిన హరికేన్ లాంతరు, వుండి వుండి 'గుప్పు' 'గుప్పు' మంటూ, ఎప్పుడు ఆరిపోతుందోనన్న భావాన్ని కలిగిస్తోంది.

రత్నాలు ఆ లాంతర్ని కళ్ళారా చూస్తున్నా, అదేమీ పట్టించుకోనే లేదు. ఆమె మెదడు నిండా తన భవిష్యత్తు గురించిన ఆలోచనలే!

రత్నా భర్త నారాయణ, నెల రోజుల క్రితం ఓ యాక్సిడెంటులో ఇరుక్కుని చావు బ్రతుకుల మధ్య కొద్ది క్షణాలు కొట్టుకుని, శాశ్వతంగా కళ్ళు మూసేశాడు. అతని మరణానికి సానుభూతి తెలియజేస్తూ, అధికారులు మూడు వేల రూపాయల కంపెన్సేషన్ మంజూరీ చేశారు. అయితే, ఆ పైకం ఇంకా ఆ అభాగ్యురాలికి అందకపోవడం చాలా చింతించవల్సిన విషయమే.

రత్నాలు దంపతులు, పిల్లా, పాపకు నోచుకోని దురదృష్టవంతులు. నారాయణకు అన్నదమ్ములు గాని, అక్కచెల్లెలు గాని, ఇంకే విధమైన

ఆత్మీయులు గాని లేరు. అదే విధంగా రత్నాలుకి కూడాను. ఇంతవరకు వాళ్ళిద్దరూ ఒకరికొకరు ఆసరాగా, పరస్పరానురాగంతో బ్రతుక్కొచ్చారు పాపం. ఇప్పుడు ఆ ఒక్క పట్టుకొమ్మ విరిగిపోయేసరికి, రత్నాలు నిరాధార అయిపోయింది. ఏకాకిగా జీవితాన్ని గడపాల్సిన గతి పట్టింది. తన ఒంటరి జీవితం కంటె, ఆమెకి భవిష్యత్తు మరీ భయంకరంగా కనిపించింది. ఏం చెయ్యడమా అన్న ప్రశ్న ఆమెను ప్రతిక్షణం కలవర పరుస్తూ వస్తోంది.

ఆ కలవరపాటును కప్పిపుచ్చుతూ, ఆమెలో ఓ ఆలోచన తలెత్తింది. తనకి రావల్సిన పైకం చేతికందితే, యేదో చిన్న దుకాణం పెట్టుకుని, గౌరవప్రదంగా జీవించాలన్న నిశ్చయానికి వచ్చింది. అయితే రావాల్సిన కంపెన్సేషన్‌గాని, ప్రావిడెంటు ఫండుగాని, యే ఒక్కటీ యింతవరకూ చేతిలో పడకపోవడం ఆమెలో నిరుత్సాహాన్ని యినుమడింప జేసింది.

"నా అనే వాళ్ళెవరూ లేకపోయినా, ఆ కుటుంబాన్ని కొన్నేళ్ళ నించీ ఆదుకుంటూ, అవసర సమయాల్లో సహకరిస్తూ వస్తున్న ప్రక్కింటాయన పరబ్రహ్మంగారే, తనకి ఆసరాగా భావించిన రత్నాలు ఆయన్ని దైవస్వరూపులుగా గౌరవిస్తూ వుండేది. ఆయన అండగా లేకపోతే, యీసరికి తను ఏమయ్యుండేదోనని, అప్పుడప్పుడూ తలపోస్తూ వుండేది. తనకి రావాల్సిన పైకం గురించికూడా ఆయనే నిస్వార్థంతో ప్రయత్నిస్తూ వుండటం, ఆమెని కృతజ్ఞతా భావంతో నింపివేసింది.

బైట జోడు చప్పుడు వినిపించి, తలెత్తి చూసింది రత్నాలు. పరబ్రహ్మంగారు వస్తూ వుండటం గమనించి, చప్పునలేచి నుంచుంది. మూలగా వున్న ఓ చిన్న బల్లను ముందుకుతీసి చీర చెంగుతో శుభ్రంగా తుడిచింది.

"రండి బాబుగారూ: కూచోండి" అంది సవినయంగా.

పరబ్రహ్మం కూచున్నాడు.

"ఎప్పుడూ అట్లా దిగులుగా కూచుంటావేమిటమ్మా!" అన్నాడు.

"నా బతుక్కి, అంతే రాసిపెట్టి వుంది బాబూ!" రుద్ధ స్వరంతో అంది రత్నాలు.

"అబ్బే అదేం నాకు నచ్చదమ్మా! అలా ఎప్పుడూ దిగులుగా వుండి బాధపడితే మాత్రం, బ్రతుకు బాగుపడిపోతుందా చెప్పు? ఏవిఁటో నీ పిచ్చిగాని; ఆఁ యిప్పుడు రావడం దేనికి అంటే, అదేపనిగ అను దినం ఆఫీసుల్లో తిరిగి, చెప్పులు అరగగొట్టుకుంటున్నా, యిన్నాళ్ళకి ఆ పైకం నీకు ముట్టజెప్పే యేర్పాటు చేయగలిగాను. ఈ విషయం నాకెంతో తృప్తిని కలిగిస్తోంది. రేపోసారి ఆఫీసుకి వస్తే, నీకాపైకం ముడుతుంది" వుత్సాహంగా చెప్పాడు పరబ్రహ్మం.

రత్నాలు మొహంలో, సంతోషం ఓ కొత్త వెలుగును తెచ్చి పెట్టింది. చేతిలో పైకం పడితే, ఒక విధమైన గుండె నిబ్బరం ఏర్పడు తుందనీ, తన భవిష్యత్తుకి ఒక రూపాన్ని దిద్దుకోవడానికి అవకాశం కలుగుతుందని మురిసిపోయింది. కళ్ళల్లో ఆనంద భాష్పాలు మెరుస్తు న్నయ్.

"ఏదో బాబూ, మీరు వుండబట్టి 'నా' అనేవారెవ్వరూ లేని లోటు నాకు తీరింది. తండ్రి తర్వాత తండ్రిలా, కష్టదశలో నన్ను ఆదుకు న్నారు. చీకటిలో ప్రయాణం చేస్తున్న నాకు చేయూతనిచ్చారు. మీ ఋణం యెలా తీర్చుకోగలనో, యేవిఁటో...." కృతజ్ఞతతో అంది.

పరబ్రహ్మం నల్లని పెదవులు మెల్లగా కదిలి, సన్నని మంద హాసాన్ని చిందించాయి. అతనికి కృతజ్ఞతలు చెప్పుకునే వాళ్ళు చాలా మంది వున్నారు. వారిలో రత్నాలు ఒకామె. వాళ్ళందర్నీ తలుచుకునే గామోసు, ఆ మందహాసం!

"ఆ! దానిదేముందిలే రత్నాలూ! మానవజన్మ యెత్తాక, ఒకరి కొకరు చేయూత నిచ్చుకోకపోతే యెట్లా? ఆ సహకారబుద్ధి లేని వ్యక్తి సంఘంలో వుండడానికి అనర్హుడంటాను. నిజం చెప్పాలంటే, ఇదంతా ఆ పరమేశ్వరీ విలాసమే కదా: కష్టదశలో వున్నవారిని ఆదుకుందుకు, ఆ సర్వేశ్వరుడే యెవర్నో ఒకర్ని, నియోగిస్తాడు. సహకారాన్ని అందించే వారూ, పొందినవారూ, కేవలం నిమిత్త మాత్రులే. ఇక కృతజ్ఞత తెల్పు కోవడమంటావా, అదంతా వట్టి భ్రమ. కృతజ్ఞత ఆ భగవంతుడికే చెప్పు కోవాలి. సరే, నేను వెళ్ళొస్తాను! రేపు పదింటికి తయారుగా వుండు.

మా నౌకరు వస్తాడు. వాడితో కలిసి ఆఫీసుకొచ్చేయ్" అంటూ వెళ్ళాడు పరబ్రహ్మం.

అతడు కేవలం కష్టదశలో వున్న వాళ్ళని ఆదుకోవడానికే జన్మించినట్టుగా భావించింది రత్నాలు.

"అలాగే బాబూ; ఆఫీసుకు వచ్చేస్తాను" అంది తృప్తిగా. చాలా రోజుల తర్వాత కొద్దిపాటి వుత్సాహం ఆమెలో మొలకెత్తింది.

పరబ్రహ్మం హుందాగా నడిచిపోయాడు.

రానున్న పైకంతో, తన భవిష్యత్తును ముడివేసుకుంటూ' ఆలోచనల అంబర వీధిలో పయనించసాగింది రత్నాలు. హరికేన్ లాంతరు మరీ పొగబారిపోతోంది. అయినా, ఆమె పట్టించుకోలేదు.

*　　　*　　　*

పరబ్రహ్మంగారు చెప్పింది వేద వాక్యమే కాబట్టి సరిగ్గా పది గంటలకు తయారయ్యే వుంది రత్నాలు. పరబ్రహ్మంగారి నౌకరు టంచనుగా పది గంటల పది నిముషములకు రానే వచ్చాడు. రత్నాలు అతడి వెంట బయలుదేరింది. పరబ్రహ్మంగారు తన శ్రేయస్సుకై ఎన్ని శ్రమలు తీసుకుంటున్నారు?.... అనుకుంటూ ఆయన్ని మనస్సులో అభినందించుకుంది.

కంపెన్సేషన్ మూడువేల రూపాయలు, ప్రావిడెంట్ ఫండు పదహారు వందలూ ఆమెకి ముట్టాయి. అంత డబ్బు ఒక్కసారి చూసే సరికి, ఆమె కళ్ళు జిగేల్ మన్నాయి. ఆ పైకమంతా తన దగ్గర పెట్టుకుని, యింటికి పోవడం శ్రేయస్కరం కాదేమోనన్న భీతి కలిగిందామెకి. తన భయాన్ని ఆమె వ్యక్తం చేయబోతూ వుండగా పరబ్రహ్మమే అందుకున్నాడు.

"ఏవమ్మా అంత డబ్బు దగ్గర పెట్టుకుని, యింటికి వెళ్ళగలవా? రోజులు చూస్తే, ఏం బావులేవు" అన్నాడు అభిమానం వుట్టిపడుతూ వుంటే.

ఆయన ఎంత సహృదయులు? తన బాధ్యత తీరిపోయింది కదా అని వూరుకోలేదు. ఇంతగా ఎదుటివారి మంచిని కోరే వ్యక్తులు, ఎంత

మంది వుంటారీ ప్రపంచంలో?... అన్న భావన రత్నాలులో మరింత కృతజ్ఞతా భావాన్ని పెంపొందించింది.

"అదే, నాకూ భయంగా వుంది బాబుగారూ: మీ దగ్గరే ఈ డబ్బు వుంచండి. ఇంటి దగ్గిర యిచ్చేద్దురుగాని...." అంటూ, అంత మొత్తాన్నీ పరబ్రహ్మంకి అందించింది.

"సరే: ఇంతా చేసినవాణ్ణి, యీ భారాన్ని మొయ్యలేక పోతానా? అయితే నువ్వు వెళ్ళు. డబ్బంతా యింటికి తీసుకొచ్చి యిస్తాను' అంటూ ఆ పైకాన్ని లాల్చీ జేబుల్లో పెట్టేశాడు పరబ్రహ్మం.

రత్నాలు నిశ్చితంగా, నిర్భయంగా ఆ నౌకరు వెంట యింటివేపు దారితీసింది.

పన్నెండు గంటలు దాటింది, గాలి స్తంభించినట్లుగ, ఆకులు కూడా అల్లాడ్డం లేదు. ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని, కళ్లారా చూస్తున్నా ఏమీ చెయ్యలేక పోతున్నందుకు గామోసు, సూర్యుడు కోపంతో కళ్ళెరచేసి చూస్తున్నాడు. అంత ఎండలోనూ వచ్చాడు పరప్రహ్మం.

అప్పుడే కాస్తంత ఎంగిలిపడి కూచుంది, రత్నాలు. పరబ్రహ్మం గార్ని చూడ్డంతోనే, సగౌరవంగా లేచి నుంచుంది. బల్ల కాస్త ముందుకు వేసి, చీర చెంగుతో శుభ్రం చేసింది. పరబ్రహ్మం కూచున్నాడు. శ్రమ తీసుకుని, ఎండలో వచ్చినందుకు సాక్ష్యంగా మొహం స్వేదబిందువులతో నిండిపోయింది, పై వుత్తరీయంతో మొహాన్ని ఓసారి ఒత్తుకున్నాడు. లాల్చీ జేబులోనికి చేతిని పోనిచ్చాడు.

రత్నాలు దృష్టి, అతని చేతికేసీ వుంది. జేబులోంచి పైకాన్ని తీస్తున్నాడనుకుంది. కాని ఆయన తీసింది మాత్రం పైకం కాదు. ఏదో రాసివున్న తెల్ల కాగితం. అవేమీ అర్థం కాలేదు.

ఉపన్యాస మిచ్చేముందు రాజకీయ నాయకుడు గొంతు సవరించు కున్నట్టుగా, ఓసారి గొంతు సవరించుకున్నాడు పరబ్రహ్మం.

"చూడమ్మా రత్నాలు, నీతో చాలా రోజుల్నించి ఓ విషయాన్ని చెప్పాలనుకుంటూనే, నీ పరిస్థితికి జాలిపడి; చెప్పడానికి నోరు రాక చెప్ప లేకపోయాను. నారాయణ బ్రతుకున్న రోజుల్లో అతడికి సహాయం చేయ

గలిగే వ్యక్తి ఒక్కడూ అగుపించలేదు. అప్పుడప్పుడూ ఆదుకున్న నన్ను నమ్మాడు. నన్ను దేవునితో సమానంగా భావించేవాడు. అతడంటే నాకూ అభిమానం వుండేది. సానుభూతి వుండేది. అతడు ఎప్పుడు ఏ అవసరంలో వున్నా, దగ్గిరికి వచ్చేవాడు. నిరాశకు తావు లేకుండా తప్పని సరిగ ఆదుకునేవాణ్ణి. ఒక మనిషికి, మరో మనిషి చేయగలిగిన సహాయం ఏముంటుంది గనుక? కష్టదశలో ఆదుకోవడమే! అదే మానవత్వం, ఆ మానవత్వమే నాలో లేకపోతే, నారాయణకు అప్పుడప్పుడూ అప్పుగా, మూడు వేల వరకూ యిచ్చి వుండేవాణ్ణి కాదేమో. ఇంత డబ్బు యేం చూసి యిచ్చానంటావు? మంచితనం చూసి. ఎందుకయినా మంచిది ఓ నోటు రాసివ్వవోయ్ అంటే కాదనకుండా చిరునవ్వుతో యీ నోటు రాసిచ్చాడు. ఆ మధ్య చచ్చిపోయి యే లోకంలో వున్నాడో గాని, శేషయ్య సాక్షి సంతకం పెట్టాడు. ఇవన్నీ కేవలం ఓ పద్ధతిని అనుసరించాలనే వుద్దేశంతోనే గాని, నారాయణమీద నమ్మిక లేకపోవడంవల్ల కాదు. నేను యెట్లాంటి మనిషినో, నీకూ తెలుసు. ఈ సమయంలో యీ కాగితాన్ని బైటికి తీయక తప్పింది కాదు. ఇప్పుడు నువ్వేమంటావో నీ యిష్టం— నేనేం చెప్పను" అంటూ కాగితాన్ని మడతలు విప్పి ఆమె కందివ్వబోయాడు పరబ్రహ్మం.

కొయ్యబారిపోయిన రత్నాలకి, కళ్లు గిర్రున తిరుగుతున్నట్టనిపించింది. ఆ నోటు తను చూసి మాత్రం ఏం చేస్తుంది? తనకేం అర్థమవుతుంది గనుకనా? అయినా, పరబ్రహ్మం లాంటి పరోపకార బుద్ధిగల మనిషి, అబద్ధం చెబుతాడని ఎలా అనుకోగలదు? మొదట్నుంచీ తమకి సహకరిస్తున్న మనిషి, తమని మోసగిస్తున్నాడేమోనన్న సందేహాన్ని ఎలా తెచ్చుకోగలదు? నిజానికి మోసం యిందులో యేముందని? భర్త సంతకంతో నోటు కళ్ళెదురు కనిపిస్తూనే వుంది. అందునా పరబ్రహ్మంగారు, దైవ స్వరూపులు. అతని మనస్సు యెప్పుడూ మంచినే కోరుతుంది. అన్యాయమన్న పదం అతనికి తెలీదు. అటువంటి పరబ్రహ్మంగారు చెప్పింది నమ్మకపోవడం మరీ అన్యాయం.... అనుకుంది రత్నాలు. ఆ నోటు విషయం తనకేం తెలీదనంటే. ఘోర పాపం తనని చుట్టుకుంటుందనుకుంది. అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

'నేను మాత్రం చెప్పవల్సిందేముంది బాబుగారూ మొదట్నుంచీ మమ్మల్ని ఆదుకుంటున్నారు మీరు. ఆ సంగతి, నాకు మాత్రం తెలీదు గనుకనా? అటువంటి మిమ్మల్ని అన్యాయం చేస్తానా చెప్పండి? ఉపకారం చేసేవారికి, అపకారాన్ని తలపెడతానా? అలా ఎప్పుడూ జరగదు బాబూ' అంది.

'కావాలంటే. ఈ నోటు, ఎవరికయినా చూపించవచ్చునమ్మా నీ ఇష్టం. నేను అభ్యంతరం చెప్పను' మళ్ళీ అన్నాడు పరబ్రహ్మం.

'ఎంత మాట అన్నారు బాబూ? మీ మాటలపై నమ్మకాన్ని పోగొట్టుకోవల్సిన నీచస్థితికి దిగజారలేదు బాబూ! మీ మీద, మీమాట మీద, నాకెప్పుడూ విశ్వాసమూ, నమ్మకమూ ఉన్నయ్. మీకు రావల్సిన పైకాన్ని మీరు అడగండి బాబూ!' అంది రత్నాలు.

"బలవంతంగా డబ్బు తీసుకుంటున్నానని గాని, మొగమాటం పడేస్తున్నాననిగాని, భావించకమ్మా."

"అదేవిఁటి బాబూ, అలా అంటారు! ఇటువంటి ఆలోచనలే లేవు నాలో. మీ డబ్బు మీకివ్వడానికి బలవంతవేవిఁటి చెప్పండి."

"ఈ సమయంలో నేను చేయగల్గిన సహాయం ఒక్కటేనమ్మా! నువ్వు యేకాకివి గాబట్టి, నిరాశ్రయవు గాబట్టి, నీ శేష జీవితమంతా గడవాలి గాబట్టి అప్పట్నుంచీ బాకీపడ్డ వడ్డీ, సుమారు ఒక వెయ్యి రూపాయల వరకూ అయిందనుకో – దాన్ని వదులుకుంటున్నాను. డబ్బుకి ఎంత విలువున్నా, మానవత్వపు విలువల్ని మర్చిపోయి, నిన్ను బికారిగా చెయ్యడానికి నా మనస్సు అంగీకరించడం లేదమ్మా! అందుకనే ఆ వడ్డీ లెక్కలోకి తీసుకోలేదు. మీ కుటుంబంపట్ల నాకుండే అభిమానానికి తార్కాణంగా, యీ మాత్రం సహాయమైనా చెయ్యకండా వుండలేను." అన్నాడు పరబ్రహ్మం. తనంతటి విశాల హృదయుడూ, మానవత్వం గల మానవుడూ, పృథివిలో మరెక్కడా లేడని చెబుతున్నట్టుగ.

"మీ ఋణాన్ని, యీ జన్మలో తీర్చుకోలేను బాబూ!" అని మాత్రం అనగలిగింది, రత్నాలు కృతజ్ఞతను మనసులో నింపుకుని ఆయన వడ్డీ కూడా తీసుకోదలిస్తే, తన గతి యింకేం కావాలి?....అన్న భావం మెదిలే సరికి, ఆయనపట్లగల గౌరవ భావం రెట్టింపయ్యింది.

"ఇంక యీ నోటు యెందుకు?" అంటూ చేతిలో వున్న కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చించి, బైట వున్న మురుగు కాలవలోకి విసిరేశాడు, పరబ్రహ్మం.

"కంపన్సేషన్ రూపంలో వచ్చిన మూడువేల రూపాయలు, నేను తీసుకున్నట్టే నమ్మా. ఇదిగో ప్రావిడెంటు ఫండు బాపతుగా వచ్చిన పైకం పదహారు వందలూను" అంటూ మరో జేబులోంచి నోట్లకట్ట తీసి అందించాడు. "లెక్కపెట్టుకో."

"మళ్ళీ అలాగే అంటారేమిటి బాబూ, మీ మీద నమ్మకం లేదు గనుకనా?" పైకాన్ని అందుకుంటూ అంది రత్నాలు.

"ఈ పైకాన్ని, నీ ప్రాణంతో సమానంగా కాపాడుకోవాలి సుమా! ఏదో చిన్న దుకాణం పెట్టుకుని, శేష జీవితాన్ని గడపడానికి ప్రయత్నించు. రోజులేం మంచివి కావు.... ఎవ్వర్నీ నమ్మకు, ఇంతకంటె నేనేం చెప్పగలను చెప్పు? మరి, వెళ్ళొస్తా" లేచాడు పరబ్రహ్మం.

"మంచిది బాబూ!" కృతజ్ఞతా భావంతో, రెండు చేతులూ జోడించింది, రత్నాలు.

పరబ్రహ్మం, మందహాసం చేసుకుంటూ బైటికొచ్చాడు. అతను చించి పారేసిన కాగితం ముక్కల్లో రెండు ముక్కలు కాలవగట్టు పైనే వుండిపోయి, అతనికేసి చూస్తూ నవ్వుతున్నట్టుగా కదిలాయి గాలికి. అతను మాత్రం అదేం పట్టించుకోకండా, ముందుకు సాగిపోయాడు.

భవిష్యత్తును గురించి, యెన్నో ఆశలు పెంచుకున్న రత్నాలు, చేతిలో వెక్కిరిస్తోన్న డబ్బు చూసి, కృంగిపోయింది. ఆమె హృదయం నిస్పృహతో ముడుచుకుపోయింది. తను వూహించింది ఏవిఁటి? ఇప్పుడు నిజంగా జరిగిందేవిఁటి? .... భవిష్యత్తు తల్చుకుంటేనే ఆమెకి భయం వేసింది. బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, చెమ్మగిల్లిన కళ్లు చీర చెంగుతో ఒత్తుకుని, ఆ పైకాన్ని పెట్లో పెట్టేసింది.

ఆ రోజునించీ, పరబ్రహ్మం ఆ ఇంటి గడపే తొక్కలేదు. ఆ అవసరం అతనికి కనిపించలేదేమో మరి!

పాపం, రత్నాలుకి ఏం తెలుసు - పరబ్రహ్మం తనకి అన్యాయం చేశాడని? ఆమెకేం తెలుసు — తియ్యని విషమిచ్చి, తన ఆశల్ని హత్య

చేశాడని? ఆమెకేం తెలుసు – ధనాశా పీడితుడైన పరబ్రహ్మం, నమ్మిన తనని ద్రోహం చేసి, ఆ నోటును బనాయించాడని ఆమెకేం తెలుసు – అతని అన్యాయానికి బలియై తను మూడువేల రూపాయలు నష్ట పోయిందని?

ఆమెకి తెలిసిందంతా, ఒక్కటే! పరబ్రహ్మం, పరమ పవిత్రుడని, దైవ స్వరూపుడని, మానవత్వం గల ఒక మనిషని; అందుకే అయన్ని గుడ్డిగా గౌరవించింది .... నమ్మింది. కాని నమ్మిన వాళ్ళను మోసం చెయ్యడం మంచిగా మనిషి గొంతులు కొయ్యడం పరబ్రహ్మంకి పరిపాటే నని ఆమెకి తెలీదు. ఆమెలో ఆ విధమైన దుష్ట చింతన లేకనే మోస పోయింది. ఆమె మంచితనమే ఆమెను వంచించింది, పాపం!

* * *

సంవత్సరం తిరక్కముందే ఎవరో అన్నారు రత్నాలు పొరు గూరులో అడుక్కు తింటుందని? ఆ విషయం పరబ్రహ్మం చెవినపడింది. అయితేనేం – అతను అంతగా బాధపడలేదు. ప్రతి చిన్న విషయానికి బాధపడేటంతటి చిన్న హృదయం కాదతనిది. ఆ నల్లని పెదాలు మాత్రం వికృతంగా ఓ పొడి నవ్వు నవ్వుతున్నాయి. ఒకరు నాశనమైతేనే గాని మరొకరు బాగుపడరు, ఇది పరబ్రహ్మం నమ్ముకున్న సత్యాల్లో ఒకటి, రత్నాలు, అడుక్కుతింటే తనకేం? తన బ్యాంకు అకౌంటు మరో మూడు వేలు పెరిగింది.... అనుకుని, తృప్తిగా నవ్వుకున్నాడా మానవుడు.

రత్నాలు మాత్రం యిప్పటికీ నిజం తెలుసుకోలేదు. ఇంక నిజాన్ని గుర్తించలేదు కూడాను. ఎప్పుడో, ఎక్కడో యెవ్వరికీ తెలీకుండా అనామకురాలిగా కళ్ళు మూస్తుంది ఎవరిక్కావాలి?

* జ్యోతి, సచిత్ర మాసపత్రిక *